సాక్షి
సంగారెడ్డి
గురువారం । 24 । అక్టోబర్ । 2024



సొంతింటి కల నెరవేరేనా?
ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లను అందజేసేందుకు శ్రీకారం చుట్టింది.
వివరాలు 8లో ▸



చిన్నారిని చిదిమేసిన బస్సు
స్కూల్ బస్సు ఢీకొని ఒకటో తరగతి విద్యార్థిని మృతిచెందింది. ఈసంఘటన పెద్దశంకరంపేట మండలంలో చోటు చేసుకుంది.
వివరాలు 8లో ▸



తారురోడ్లపై 'మట్టి పూతలు'
నియోజకవర్గంలోని పుల్‌కల్ మండలంలోని రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి.
వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ఎల్‌ఆర్‌ఎస్ పరిష్కార వేదిక



ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కమిషనర్ సంగారెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు దారులకు మరింత మెరుగైన సేవలు అందించాలన్న లక్ష్యంతో తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో ప్రతి మంగళ, బుధవారం ఎల్‌ఆర్‌ఎస్ -2020 పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఈ వేదికను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను మరింత వేగవంతం చేయడం కోసం ఈ వేదికను ఏర్పాటు చేశామన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులకు ఏమైన సందేహాలు ఉంటే వారికి సూచనలు, సలహాలు ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఊరుకోం

డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

జహీరాబాద్: శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కావాలని ఎవరైనా సంఘ విద్రోహక చర్యలకు పాల్పడినా ఊరుకునేది లేదన్నారు. శాంతిభద్రతలను కాపాడేందుకుగాను ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. చట్టాన్ని ఉల్లంఘించినా బాధ్యులపై చర్యలు తప్పవన్నారు. ఈ విషయంలో ఎంతటి వారైనా ఉపేక్షించబోమన్నారు. సమావేశంలో సీఐ శివలింగం పాల్గొన్నారు.

అదనపు తరగతి గదులకు భూమి పూజ



అదనపు తరగతుల గదులకు భూమి పూజ చేస్తున్న డీఈఓ వెంకటేశ్వర్లు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం బుధవారం జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రమతి సాఫ్ట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో అదనపు గదులకు రూ.75 లక్షల విరాళం అందజేశారని తెలిపారు. ఈ సందర్భంగా దాతలకు ఆయన అభినందించారు. కార్యక్రమంలో సంస్థ సీఈవో విజయ్, మెడ్వన్, స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించండి

డీఈఓ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వర్లు

కల్హేర్(నారాయణఖేడ్): గ్రామ పంచాయతీల్లో సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల ప్రత్యేక అధికారి అయిన జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. బుధవారం సిర్గాపూర్ మండల పరిషత్‌లో అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పారిశుద్ధ్యం, తాగు నీరు, ఉపాధి హామీ పనులు, నర్సరీల ఏర్పాటు, బీసీల కులగణన తదితర అంశాలపై చర్చించారు. అంతకు ముందు ఆయన సిర్గాపూర్ మండల ప్రత్యేకాధికారిగా బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్సూర్, ఎంపీఓ బ్రహ్మం, ఏపీఓ బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎవరెస్ట్‌కు పీసీబీ షోకాజ్!

ఈ బల్క్‌డ్రగ్ పరిశ్రమతో భారీగా కాలుష్యం

- లక్ష్మీనారాయణపూర్ చెరువు, గాలి కాలుష్యంతో స్థానికుల ఇబ్బందులు
- ఎందుకు చర్యలు తీసుకోవద్దో వివరణ ఇవ్వండి
- యాజమాన్యానికి నోటీసులిచ్చిన పీసీబీ



పరిశ్రమ నుంచి వెలువడుతున్న కాలుష్య జలాలతో కలుషితమైన నీటి వనరులు



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ఎవరెస్ట్ ఆర్గానిక్ పరిశ్రమకు కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ ఫ్యాక్టరీ నుంచి నిబంధనలకు విరుద్ధంగా వెలువడుతున్న కాలుష్య జలాలను పరిశ్రమ బయటకు వదులుతున్నారని, దీంతో సమీపంలోని చెరువు, ఇతర నీటి వనరులు కలుషితం అవుతున్నాయని పీసీబీ నోటీసుల్లో పేర్కొంది. ఈ నీటిని తాగిన పశువులు మృత్యువాత పడుతున్నాయని, అలాగే ఆయా నీటి వనరుల్లోని చేపలు ఇతర జీవజాతుల మనుగడ ప్రశ్నార్థకంగా తయారైందని పేర్కొంది. ఇలా నిబంధనలకు విరుద్ధంగా పరిశ్రమను నడుపుతున్నందుకు నీటి కాలుష్యం నివారణ, నియంత్రణ చట్టం 1988 లోని సెక్షన్ 33ఏ కింద, అలాగే గాలి కాలుష్యం నివారణ, నియంత్రణ చట్టం కింద ఎందుకు చర్య తీసుకోకూడదో తెలపాలని నోటీసుల్లో పేర్కొంది.

గ్రామస్తులు, ప్రజాసంఘాల ఫిర్యాదులు

ఈ పరిశ్రమ నుంచి వెలువడుతున్న కాలుష్యంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. పలు ప్రజా సంఘాలు కూడా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా కలెక్టరేట్‌లోనూ వినతిపత్రాలు అందజేశారు. దీంతో ఇప్పటికే రెండు పర్యాయాలు విచారణ చేపట్టిన కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఈ మేరకు ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు.

హానికరమైన సీఓడీ అధికం

ఈ పరిశ్రమ కారణంగా కలుషితమైన నీటి వనరుల్లోని నీటి శాంపిల్‌లను పీసీబీ అధికారులు సేకరించి ల్యాబ్‌కు పంపారు. ఈ ల్యాబ్ రిపోర్టు కూడా అధికారులకు అందింది. ఈ పరిశ్రమ నుంచి వస్తున్న కాలుష్య జలాలతో నీటి వనరులు కలుషితమై అందులో జీవజాతులకు హానికరమైన స్థాయిలో సీఓడీ (కెమికల్ ఆక్సిజన్ డిమాండ్) అధిక మొత్తంలో ఉన్నట్లు తేలింది. బీఓడీ (బయోలాజికల్ ఆక్సిజన్ డిమాండ్) కూడా ఎక్కువగానే ఉన్నట్లు ల్యాబ్ నివేదిక తేల్చింది.

పర్యావరణానికి హానికరం

సదాశివపేట మండలం ఆరూర్ సమీపంలో ఉన్న ఈ పరిశ్రమ నుంచి వెలువడుతున్న కాలుష్యంతో పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోంది. జెడ్‌ఎల్‌డీ (జీరో లిక్విడ్ డిస్‌చార్జ్) యూనిట్‌గా ఉన్న ఈ పరిశ్రమ నుంచి వెలువడుతున్న కాలుష్య జలాలతో ఈ గ్రామంతో పాటు మునిపల్లి మండలం లక్ష్మీనారాయణపూర్ చెరువు కలుషితమవుతోంది. ఈ చెరువు నిండినప్పుడు ఈ నీరంతా గంగకత్వవాగులో కలుస్తుంది. ఈ వాగు మంజీరా నదిలోకి కలుస్తోంది. ఈ పరిశ్రమ నుంచి వెలువడుతున్న కాలుష్య జలాలతో ఆయా నీటి వనరులపై ప్రభావం పడుతుందనే ఫిర్యాదులు ఉన్నాయి. అలాగే గాలి కాలుష్యంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

రెండు సార్లు నోటీసులిచ్చాం

పలు ప్రజాసంఘాలు, స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎవరెస్ట్ ఆర్గానిక్స్ పరిశ్రమకు రెండు పర్యాయాలు షోకాజ్ నోటీసులు జారీ చేశాం. ఈ పరిశ్రమ నుంచి వస్తున్న కెమికల్ వాటర్‌తో స్థానికంగా ఉన్న చెరువు నీరు కలుషితమవుతోందని తేలింది. మరోసారి ఈ పరిశ్రమను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం.

– గీత సపారే, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్. పీసీబీ

పట్టు పురుగులతో పుట్టెడు లాభాలు

ఉద్యావన శాఖ డీడీ సోమేశ్వర్‌రావు



మొగుడంపల్లిలో పట్టు తోటను పరిశీలిస్తున్న డీడీ సోమేశ్వర్‌రావు, అధికారులు

జహీరాబాద్ టౌన్: పట్టు పురుగుల పెంపకం వల్ల మంచి లాభాలు పొందవచ్చని ఉద్యావన శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు (డీడీ) సోమేశ్వర్ రావు అన్నారు. మండల కేంద్రమైన మొగుడంపల్లిలో బుధవారం ఓ రైతు సాగు చేస్తున్న మల్బరీ తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాణిజ్య పంటల కన్నా పట్టు పరిశ్రమ ద్వారా అధిక ఆదాయం పొందవచ్చన్నారు. ప్రభుత్వం కూడా అనేక ప్రోత్సహకాలు అందిస్తుందని చెప్పారు. మల్బరీ మొక్కల పెంపకం, షెడ్డు నిర్మాణం, పరికరాలు, మందులు తదితర ఖర్చులపై రాయితీలు ఇస్తుందన్నారు. ఈ ఏడాది జిల్లాలో 40 ఎకరాల్లో మల్బరీ తోటల పెంపకం లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికే సగం లక్ష్యం పూర్తయిందని చెప్పారు. రైతులు ముందుకు వచ్చి మల్బరీ తోటల ద్వారా లాభాలు అర్జించాలని కోరారు. ఆయన వెంట సెరీకల్చర్ జిల్లా అధికారి శ్రీనివాస్, జహీరాబాద్ హార్టికల్చర్ అధికారి పండరీ ఉన్నారు.

ఏడుపాయల హుండీ ఆదాయం రూ. 39.91 లక్షలు



పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వనదుర్గా భవాని ఆలయ హుండీ ఆదాయం రూ. 39,91,361 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి చంద్రశేఖర్, దేవాదాయ శాఖ హుండీ ఇన్‌చార్జి సుధాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం కరీంనగర్ సేవా సమితి ఆధ్వర్యంలో 83 రోజుల అనంతరం హుండీ లెక్కింపు నిర్వహించారు. ఆదాయంతో పాటు మిశ్రమ బంగారు వెండి కానుకలు వచ్చినట్లు చెప్పారు.

ప్రత్యేక పాలసీ ప్రకటించాలి

ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు బస్వరాజ్ పాటిల్

కల్హేర్(నారాయణఖేడ్): వికలాంగుల పట్ల సమాజంలో వివక్షత కొనసాగుతోందని జాతీయ వికలాంగుల హక్కుల వేదిక (ఎన్‌పీఆర్‌డీ) జిల్లా అధ్యక్షుడు బస్వరాజ్ పాటిల్ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం కల్హేర్‌లో విలేకరులతో మాట్లాడారు. వికలాంగుల కోసం ఉన్న చట్టాలు సక్రమంగా అమలు కావడం లేదన్నారు. విద్యా, ఉపాధి అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వికలాంగులపై దాడులు, దౌర్జన్యాలు, మహిళలపై లైంగిక వేధింపులు పెరిగిపోతున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగుల విద్య కోసం ప్రత్యేక విద్య పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు అక్టోబర్ 25–27 జరుగుతాయని తెలిపారు. మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.

రూ.10నాణేలు స్వీకరించాలి

సంగారెడ్డి జోన్: వ్యాపారస్తులు రూ.10 నాణెలు స్వీకరించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ శాంతినగర్ శాఖ మేనేజరు సమత అన్నారు. బుధవారం సంగారెడ్డిలో రూ.10 నాణెల స్వీకరణపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను అందించారు. అన్ని ఏపీజీవీబీ శాఖలలో డిపాజిట్‌తో పాటు విత్‌డ్రా చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో శాఖ చీఫ్ మేనేజర్ ఎస్.ప్రకాశం, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

డంపు.. కంపు


- కాలనీల మధ్య చెత్త డంపు
- దుర్వాసనతో జనం అవస్థలు



దంపు యార్డులో పేరుకున్న చెత్త

పటాన్‌చెరు: కాలనీల మధ్య చెత్తను డంపు చేస్తుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డంపు వల్ల కంపు వాసనను తాము భరించలేక పోతున్నామని వారు వాపోతున్నారు. కొంత కాలంగా అమీన్‌పూర్ పట్టణంలోని కాలనీల మధ్య చెత్తను డంపు చేస్తున్నారు. పట్టణంలో దాదాపు 150 కాలనీల నుంచి సేకరించిన చెత్తను సర్వే నంబర్ 993 ప్రాంతంలో డంపు చేస్తున్నారు. వాస్తవానికి ఎప్పటికప్పుడు చెత్తను హైదరాబాద్ నగరంలోని జవహర్‌నగర్‌కు తరలించాలి. కానీ కాంట్రాక్టర్ల కక్కుర్తితో వారంలో ఒకటి లేదా రెండు సార్లు మాత్రమే చెత్తను అక్కడకు తరలిస్తున్నారు. చెత్తను నిల్వ చేయడంతో దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో కాలనీవాసులు రోగాల బారిన పడుతున్నారు. శ్వాస సంబంధిత వ్యాధులతో సతమతమవుతున్నారు. పక్షం రోజులుగా డంపు నుంచి దుర్గంధం వ్యాపిస్తోంది. టెరస్ కాలనీ, మోడీ కాలనీ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. స్వచ్ఛమైన గాలి పీల్చుకునే పరిస్థితి కూడా లేకుండా పోయిందని ఆ కాలనీవాసులు వాపోతున్నారు. తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

నిద్రపోలేక పోతున్నాం



రాత్రి పూట డంపు యార్డు నుంచి చెత్తను తరలించే క్రమంలో కంపు వాసన వస్తుంది. నిద్రపోయే పరిస్థితి కూడా లేదు. చెత్తను ఏ రోజుకారోజు తొలగించాలి. డంపు యార్డును ఇక్కడి నుంచి తీసివేయాలి.

– రామ్ దివాకర్, మోడీ కాలనీ, అమీన్‌పూర్

సమస్య ఉత్పన్నం కాకుండా చూస్తాం



డంపు యార్డుతో ఉత్పన్నమవుతున్న సమస్యను పరిష్కరిస్తామని అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి స్పష్టం చేశారు. డంపుయార్డు నుంచి చెత్తను ప్రతిరోజు జవహర్‌నగరకు తరలించే ప్రక్రియను పర్యవేక్షిస్తామన్నారు. పౌరులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని ఆమె హామీ ఇచ్చారు.

– జ్యోతి రెడ్డి, కమిషనర్

చెరకుకు మద్దతు ధర కల్పించాలి

- చక్కెర పరిశ్రమ యాజమాన్యాలకు కలెక్టర్ క్రాంతి ఆదేశం
- రైతు సంఘాలు, యాజమాన్యాలతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి జోన్: చెరకు పంటకు తగిన మద్దతు ధర కల్పించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో చక్కెర కర్మాగారాల యాజమాన్యాలు, రైతు సంఘాల నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పంట సాగు ఖర్చులు గణనీయంగా పెరిగిన కారణంగా రైతులకు మద్దతు ధర అందించే విధంగా యాజమాన్యాలు సహకరించాలని కోరారు. రానున్న కాలంలో చెరకు పంట సాగు, దిగుబడులు తగ్గకుండా ఉండాలంటే యాజమాన్యాలు ఇప్పటి నుంచే రైతుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. టన్నుకు కనీసం రూ.4,500 మద్దతు ధరగా నిర్ణయిస్తేనే లాభదాయకంగా వ్యవసాయం చేయగలుగుతారని పేర్కొన్నారు. సమావేశంలో సీడీసీ చైర్మన్ రామిరెడ్డి, షుగర్ కేన్ కమిషనర్ రాజశేఖర్, రైతు సంఘం నాయకులు, గణపతి షుగర్, గాయత్రి షుగర్స్ మాగి, గంగా కావేరి ఆగ్రో ప్రొడక్ట్ ఫ్యాక్టరీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సామాజిక వర్గాల విశ్లేషణ సర్వే

జిల్లాలో అన్ని సామాజిక వర్గాల విశ్లేషణ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని బీసీ కమిషన్ చైర్మన్ సి నిరంజన్ వెల్లడించారు. బుధవారం హైదరాబాదులోని బీసీ కమిషన్ కార్యాలయం నుంచి బీసీ కమిషనర్ సభ్య కార్యదర్శి బాలమాయ దేవితో కలసి ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాకు చెందిన వివిధ సామాజిక వర్గాల వారు ప్రభుత్వం నిర్దేశించిన ఫార్మాట్‌ను సమగ్రంగా పూర్తి చేసి ఐదు సెట్లను సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఉంచాలని, 30వ తేదీ ఉదయం 10 గంటల నుంచి నాలుగు గంటల వరకు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో బీసీ సంక్షేమ అధికారి జగదీష్, పాల్గొన్నారు.

సైబర్ బాధితులకు సత్వర న్యాయం

ఎస్పీ రూపేష్



సైబర్ బాధితుడితో ఎస్పీ రూపేష్

సంగారెడ్డి జోన్: సైబర్ బాధితులకు సత్వర న్యాయం చేస్తామని ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. రెండేళ్ల క్రితం హత్నూర మండలానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి నవీన్ సైబర్ ఉచ్చులో పడి ఆన్‌లైన్ ద్వారా రూ.30లక్షలు పోగొట్టుకున్నాడు. పోగొట్టుకున్న మొత్తం డబ్బుల్లో రూ.12.5లక్షలను హోల్డ్ చేశారు. బుధవారం తన కార్యాలయంలో బాధితుడికి ఆ డబ్బు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండేళ్ల క్రితం బాధితుడు ఆన్‌లైన్ ట్రేడింగ్ చేస్తే అధిక డబ్బులు సంపాదించాలనే అత్యాశతో అపరిచిత వ్యక్తి అకౌంట్‌లో రూ.30లక్షలు వేశాడు. చివరకు సైబర్ మోసం జరిగినట్లు గుర్తించి వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930 ఫోన్ చేశాడు. అతడు కోల్పోయిన డబ్బులో నుంచి రూ.12.5 లక్షలను హోల్డ్ చేశారు. అనంతరం హత్నూర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసిన దర్యాప్తు చేశారు. కాగా, ఆన్‌లైన్‌లో అపరిచితులతో పరిచయాలకు దూరంగా ఉండాలని, అత్యాశకు పోయి అనవసర లింకులను ఓపెన్ చేయడం, ఆన్‌లైన్ గేమ్స్ ఆడటం వంటివి చేయకూడదని సైబర్ నేరాల గురించి అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైనట్లయితే వెంటనే సైబర్ క్రైమ్ పోర్టల్‌లో నమోదు చేయడం లేదా 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు.

గ్రామాభివృద్ధికి ఉపయోగపడేలా పనులు

అసిస్టెంట్ కలెక్టర్ మనోజ్



గ్రామ సభలో పాల్గొన్న అసిస్టెంట్ కలెక్టర్ మనోజ్

వట్‌పల్లి(అందోల్): ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహించే పనులను గ్రామాభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలని అసిస్టెంట్ కలెక్టర్ మనోజ్ అన్నారు. బుధవారం అందోలు మండల పరిధిలోని నేరడిగుంట గ్రామ సభలో ఆయన మాట్లాడారు. ఈజీఎస్ ద్వారా చేపట్టే పనుల గురించి ప్రజలకు వివరించారు. పంట పొలాలకు వెళ్లే మట్టిరోడ్డు నిర్మాణం, వరద కాల్వలు, పొలాల గట్ల వెంబడి పండ్ల తోటలు పెంపకం చేపట్టాలన్నారు. గ్రామంలో ఇంకుడు గుంతలు, సామూహిక మరుగుదొడ్ల నిర్వహణ, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి ట్యాంకుల శుభ్రం చేయడం వంటి పనులను తప్పనిసరిగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ అశోక్, ఏపీవో అర్చన తదితరులు పాల్గొన్నారు.

ముచ్చటగా మూడు మున్సిపాలిటీలు!

పటాన్‌చెరు: పటాన్‌చెరు మండల పరిధిలో కొన్ని గ్రామాలు ఇప్పటికే మున్సిపాలిటీలో విలీనమయ్యాయి. తాజాగా మూడు మున్సిపాలిటీలుగా మార్చాలని ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సూచనల మేరకు అధికారులు ఒక నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు పంపించారు. మండల పరిధిలో ఇస్నాపూర్, భానూర్ ఇంద్రేశం మున్సిపాలిటీగా మార్చే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఇస్నాపూర్‌లో ఇస్నాపూర్, చిట్కుల్ లక్డారం రుద్రారం, పాషమైలారం గ్రామాలతో మున్సిపాలిటీగా అవతరించనుంది. భానూర్ మున్సిపాలిటీలో భానూరు, నందిగామ, క్యాసారం గ్రామాలు విలీనం కానున్నాయి. ఇంద్రేశం మున్సిపాలిటీలో ఇంద్రేశం, బచ్చుగుడా, రామేశ్వరంబండ, ఐనోలు, పెద్ద కంజర్ల, చిన్న కంచర్ల గ్రామాలు విలీనం కానున్నాయి .

ఈ కేవైసీకి మరో అవకాశం

- ఇప్పటి వరకు 83శాతం రేషన్ కార్డులకు పూర్తి
- మిగిలిన వారు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి
- రాష్ట్రంలో ఏ రేషన్ దుకాణంలోనైనా చేసుకోవచ్చన్న అధికారులు



సంగారెడ్డి జోన్: రేషన్ కార్డులకు ఈకేవైసీ చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. అర్హులైన నిరుపేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతుందన్న ఆరోపణల నేపథ్యంలో సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది. జిల్లా వ్యాప్తంగా 12,32,783 మంది లబ్ధిదారులు ఉండగా.. ఇప్పటివరకు 10,29,503 మంది ఈ కేవైసీ నమోదు చేయించుకున్నారు. ఇంకా 2,03,280 మంది లబ్ధిదారులు చేసుకోవాల్సి ఉంది. ఈ మేరకు జిల్లాలో 83.51శాతం నమోదు పూర్తి అయినట్లు సంబంధిత శాఖ అధికారులు వెల్లడించారు. రేషన్ కార్డులో ఉన్న సభ్యులంతా తమ చేతి వేలిముద్రలను వేసి నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. వేలిముద్ర పడని వృద్ధులు, దివ్యాంగులు ఐరిస్ (కంటి చూపు) ద్వారా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ కేవైసీ నమోదుకు సమీపంలోని రేషన్ దుకాణం వద్ద, లేదా రాష్ట్రంలోని అందుబాటులో ఉన్న రేషన్ దుకాణం లోనైనా నమోదు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. గతంలో ప్రకటించిన తేదీ ముగియటంతో మిగతా వారు నమోదు చేసుకునేందుకు మరోసారి ప్రభుత్వం అవకాశం కల్పించింది.

జిల్లాలో రేషన్ కార్డుల వివరాలు

ఆహార భద్రత కార్డులు	3,52,302
అంత్యోదయ కార్డులు	26,124
అన్నపూర్ణ కార్డులు	100
మొత్తం కార్డులు	3,78,526
మొత్తం లబ్ధిదారులు	12,32,783
ఈకెవైసీ చేయించుకున్న వారు	10,29,503
ఇంకా చేయించుకోవాల్సిన వారు	2,03,280

ఈకేవైసీ కచ్చితంగా నమోదు చేసుకోవాలి



జిల్లాలో రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులు తప్పనిసరిగా ఈ కేవైసీ నమోదు చేయించుకోవాలి. ఇప్పటివరకు జిల్లాలో 83.51శాతం పూర్తి అయింది. మిగతావారు నమోదు చేయించుకునే విధంగా అవగాహన కల్పిస్తాం. తమకు కేటాయించిన రేషన్ దుకాణంలోనే కాకుండా రాష్ట్రంలో ఎక్కడైనా అందుబాటులో ఉన్న దుకాణంలో ఈకేవైసీ నమోదు చేసుకోవచ్చు.

– శ్రీనివాస్ రెడ్డి జిల్లా, పౌరసరఫరాల శాఖ అధికారి, సంగారెడ్డి జిల్లా

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు చేర్యాల విద్యార్థి ఎంపిక



చరణ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

చేర్యాల(సిద్దిపేట): రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి కర్రోళ్ల చరణ్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి తెలిపారు. సంగారెడ్డిలో జరిగిన అండర్ 19 జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొన్న చరణ్ ఉత్తమప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా చరణ్‌ని కళాశాల అధ్యాపక బృందం అభినందించారు.

మంత్రి దామోదరను కలిసిన విద్యుత్‌శాఖ డీఈ



మంత్రి దామోదరతో డీఈ

మెదక్ కలెక్టరేట్: మెదక్ విద్యుత్ శాఖ డీఈ చాంద్‌భాష బుధవారం మంత్రి దామోదర్ రాజనర్సింహ్మను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. చాంద్‌భాష ఇటీవల బదిలీపై మెదక్ డీఈగా వచ్చారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాతో సన్మానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అల్లాదుర్గం మండలంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డీఈకి సూచించారు.

సిగరెట్ డబ్బాల్లో గంజాయి



సిగరెట్ డబ్బాలో గంజాయి

శివ్వంపేట(నర్సాపూర్):గంజాయి అమ్మకాల కోసం వ్యాపారులు రోజుకో కొత్త పంతాను ఎంచుకున్నారు. గోమారంలో రెండు రోజుల కిందట పలువురు యువకులు వ్యవసాయ పొలం వద్ద, చెట్ల పొదల మధ్య సిగరెట్‌లోని పొగాకుని తొలగించి అందులో గంజాయి నింపుకొని సేవిస్తున్నారు. ఇది గమనించిన రైతులు వారిని పట్టుకోవడానికి ప్రయత్నించగా పారిపోయారు. ఈ విషయాన్ని ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా గంజాయి అమ్మకాల పై నిఘా ఏర్పాటు చేశామని మండల ప్రజల సహకారంతో కట్టడి చేస్తామన్నారు. సిగరెట్ డబ్బాలో గంజాయి ప్యాకెట్స్ పెట్టి అమ్మకాలు చేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

నిందితురాలిని అప్పగించాలి

మహిళ మృతిపై పోలీస్‌స్టేషన్ ఎదుట కుటుంబీకులు, తండావాసులు ఆందోళన

కౌడిపల్లి(నర్సాపూర్): పంటకు కరెంట్ రక్షణ తీగ ఏర్పాటు చేసి మహిళ మృతికి కారణమైన నిందితురాలిని అప్పగించాలంటూ బుధవారం మృతురాలి కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కౌడిపల్లి మండలం జాజితండాలో మంగళవారం పంటకు రక్షణకు వేసిన విద్యుత్ తీగ తగిలి కాట్రోత్ బుజ్జితోపాటు రెండు మేకలు మృతి చెందిన విషయం విదితమే. ఈ విషయంలో కేసు నమోదు కాగా బుధవారం మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు, తండావాసులు పెద్ద ఎత్తున పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చారు. బుజ్జి మృతికి కారకులైన వారిని అప్పగించాలని ఆందోళన చేశారు. స్థానిక ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి, నర్సాపూర్ సీఐ జాన్ రెడ్డి ఆదేశాలతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తీ ఏర్పాటు చేశారు. ఇరువర్గాలను పిలిచి మాట్లాడారు. మహిళ మృతికి కారణమైన తండాకు చెందిన శోభ, కుటుంబ సభ్యులను పిలిపించి తమకు అప్పగించాలని ఆందోళన చేయడంతో వారిని పిలిపించారు. అనంతరం చర్చలు జరిపి మృతురాలి కుటుంబానికి రూ.5 లక్షలు నష్టపరిహారం చెల్లించేందు శోభ కుటుంబ సభ్యులు ఒప్పుకోవడంతో ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు.

సొంతింటి కల నెరవేరేనా?

ఇందిరమ్మ ఇళ్లపై లబ్ధిదారుల ఆశలు

- నియోజకవర్గానికి 3,500 ఇళ్లు
- కొనసాగుతున్న కమిటీల నియామకం
- ఏకపక్షంగా వేస్తున్నారని నాయకుల్లో, ప్రజల్లో ఆందోళన





ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు మంగళి ఆంజనేయులు. కొండాపూర్ మండలం మారేపల్లి గ్రామం. ఇతడికి 18 ఏళ్ల కిందట వివాహం కాగా గ్రామంలో ఇల్లు చిన్నదిగా ఉండడంతో ఏడాది త్వరాత బతుకుదెరువు నిమిత్తం సంగారెడ్డికి వచ్చాడు. అప్పటి నుంచి అద్దె ఇంట్లోనే ఉంటూ కులవృత్తి చేసుకుంటున్నాడు. గత ప్రభుత్వంలో డబుల్ బెడ్రూం కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇల్లు రాలేదు. ఈ ప్రభుత్వంలోనైనా ఇందిరమ్మ ఇల్లు వస్తుందనే ఆశతో ఇటీవలె ప్రజాపాలనలో దరఖాస్తు చేశాడు. ఇళ్ల కేటాయింపులో ఇందిరమ్మ కమిటీలదే కీలకపాత్ర అని ప్రభుత్వం ప్రకటించడంతో తనకు ఇల్లు వస్తుందో లేదో అనే అనుమానం మొదలయ్యింది. ఇది ఆంజనేయులు ఒక్కడి పరిస్థితే కాదు.. జిల్లాలో ఎంతో మంది సొంతింటి కల కోసం ఎదురుచూస్తున్నారు.

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లను అందజేసేందుకు శ్రీకారం చుట్టింది. ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్లను కేటాయించింది. లబ్ధిదారుల ఎంపిక కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీలను వేయాలని ఇటీవలె జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో అధికారులు గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో ఇందిరమ్మ కమిటీలు వేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఈ కమిటీల్లో కేవలం కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. ప్రజా ప్రభుత్వంలోనైనా సొంతింటి కల నెరవేరుతుందా అనే సందేహం ఆశావహుల్లో మొదలైంది.

గ్రామ ప్రత్యేకాధికారి చైర్మన్‌గా..

జిల్లా వ్యాప్తంగా నారాయణఖేడ్, జహీరాబాద్, సంగారెడ్డి, పటాన్‌చెరు, అందోల్ నియోజకవర్గాలు ఉన్నాయి. ఒక్కో నియోజకవర్గానికి 3,500 చొప్పున మొత్తం 5 నియోజకవర్గాలకు కలిపి 17,500 ఇళ్లను కేటాయించారు. ఈ ఇళ్లకు సంబంధించి ఏడుగురు సభ్యులతో కూడిన ఇందిరమ్మ కమిటీ వేయనున్నారు. ఈ కమిటీలకు గ్రామాల్లో సర్పంచ్ చైర్మన్‌గా ఉంటారు. అయితే ప్రస్తుతం సర్పంచ్ లేకపోవడంతో గ్రామ ప్రత్యేకాధికారి చైర్మన్‌గా, పంచాయతీ కార్యదర్శి కన్వీనర్, ఇద్దరు డ్వాక్రా గ్రూపు మహిళలు, మరో ముగ్గురు గ్రామ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే వారు ఉండనున్నారు. మున్సిపాలిటీలలోనూ కౌన్సిలర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు.

ప్రజల సమక్షంలోనే కమిటీలు వేయాలి



జిల్లాలో ఇందిరమ్మ కమిటీలను ఏకపక్షంగా నియమిస్తున్నారు. కేవలం ఒక పార్టీకి సంబంధించిన వారిని మాత్రమే కమిటీల్లో నియమించుకుంటున్నారు. ఇది ఎంత మాత్రం మంచిది కాదు. కమిటీలను ఏకపక్షంగా నియమించుకోవడం ద్వారా అసలైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతుంది. ప్రజల సమక్షంలోనే కమిటీలను ఎన్నుకోవడం ద్వారా అసలైన లబ్ధిదారులకు ఇళ్లు అందే అవకాశం ఉంటుంది. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లాం.

– ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కమిటీలపై భిన్నాభిప్రాయాలు

గ్రామాల్లో నియమిస్తున్న ఇందిరమ్మ కమిటీలపై రాజకీయ నాయకుల్లో, ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో గ్రామస్తులకు సంబంధం లేకుండా కాంగ్రెస్ నాయకులు తమకు నచ్చిన పేర్లను రాసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. వీటిపై ఇది వరకే చాలా మండలాల్లో ఎంపీడీఓలకు వినతి పత్రాలు ఇస్తుండగా, ఇటీవలె సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సైతం ప్రజామోదం మేరకు కమిటీలను ఎన్నుకోవాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో ఏకపక్షంగా కమిటీలో వారికి ఇష్టమొచ్చిన పేర్లను రాసుకోవ డం వల్ల నిజమైన అర్హులు నష్టపోతారన్నారు.

టిప్పర్ బీభత్సం : 19 గొర్రె పిల్లలు మృతి

నంగుపేట వద్ద జాతీయ రహదారిపై ఘటన



వట్‌పల్లి(అందోల్): రోడ్డుపై చెల్లాచెదురుగా పడి ఉన్న గొర్రె పిల్లలు

వట్‌పల్లి(అందోల్): అందోలు మండల పరిధిలోని సంగుపేట వద్ద నాందేడ్ జాతీయ రహదారిపై టిప్పర్ బీభత్సం సృష్టించింది. వివరాల్లోకి వెళ్తే.. నారాయణపేట జిల్లాకు చెందిన గొర్రెల కాపరులు కొద్ది రోజులుగా జాతీయ రహదారి వెంట గొర్రెలను మేతకు ఇతర ప్రాంతాలకు తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో రోజు మాదిరిగానే బుధవారం గొర్రె పిల్లల మందను తీసుకెళ్తుండగా ఒక్కసారిగా టిప్పర్ మందపైకి దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో 19 గొర్రె పిల్లలు మృతి చెందగా మరి కొన్ని గాయాలపాలయ్యాయి. వీటి ఖరీదు సుమారుగా రూ.80 వేల వరకు ఉంటుందని ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలని కాపర్లు కోరుతున్నారు. విషయం తెలిసిన జోగిపేట ఎస్‌ఐ పాండు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. టిప్పర్ వాహనాన్ని అదుపులోకి తీసుకున్నామని, ఇప్పటి వరకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

వీధికుక్కల దాడిలో 12 గొర్రెలు



జిన్నారం (పటాన్‌చెరు): మృతి చెందిన గొర్రెల వద్ద బాధితులు

జిన్నారం (పటాన్‌చెరు): వీధికుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందాయి. ఈ ఘటన గుమ్మడిదల మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. మండలానికి చెందిన తాపతి కృష్ణ కొట్టంలోని గొర్రెలపై వీధికుక్కలు దాడి చేయడంతో 12 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. మరికొన్ని గాయాలపాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ నర్సింహా రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, సొసైటీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, సంజీవ రెడ్డి, నారాయణరెడ్డి, వెంకట్‌రామ్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

రెండు బైక్‌లు ఢీ : యువకుడి మృతి



బాలక్రిష్ణ(ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): రెండు బైక్‌లు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన కౌడిపల్లి మండలం కంచన్‌పల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి కథనం మేరకు.. కంచన్‌పల్లి గ్రామానికి చెందిన దుంపల బాలక్రిష్ణ(21) మెకానిక్‌గా పని చేస్తున్నాడు. బుధవారం గ్రామ సమీపంలోనే వెల్దుర్తి మండలం మానెపల్లి గ్రామంలో బైక్ రిపేరింగ్ వర్క్ ఉందని ఇంట్లో చెప్పి స్నేహితుడు జంగల్ల భూమయ్య బైక్‌పై వెళ్తున్నారు. భూమయ్య బైక్ నడుపుతుండగా బాలక్రిష్ణ వెనుక కూర్చున్నాడు. గ్రామ శివారులోని బట్టమ్మగుడి వద్ద ఎదురుగా మానెపల్లి గ్రామానికి చెందిన అంకోల పెంటయ్య తన బైక్‌పై వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై బాలక్రిష్ణ మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలు అయ్యాయి. మృతుడి తల్లి దుంపల నాగమణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పోస్టల్ రిటైర్డ్ ఉద్యోగి..



మహమ్మద్(ఫైల్)

పాపన్నపేట(మెదక్): గుర్తు తెలియని వాహనం ఢీకొని పోస్టర్ రిటైర్డ్ ఉద్యోగి మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రమైన పాపన్నపేట శివారులో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. యూసుఫ్‌పేట గ్రామానికి చెందిన పోస్టల్ రిటైర్డ్ ఉద్యోగి మహమ్మద్ మియా(62) స్కూటీపై పాపన్నపేటకు సంతకు వస్తుండగా వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నాడు. కాగా ఆదివారం చిన్న కుతూరు షాబాన నిశ్చితార్థం జరుగగా, డిసెంబర్ 16న వివాహం జరగాల్సి ఉంది. ఇంతలోనే మహమ్మద్ మృతి చెందడంతో కుటుంబంలో తీవ్రచాయలు అలుముకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

చేపలు పట్టడానికి వెళ్లి..



దుర్గయ్య (ఫైల్)

మునిపల్లి(అందోల్): సింగూర్ ప్రాజెక్ట్‌లో నీట మునిగి వ్యక్తి చెందాడు. బుదేరా ఎస్‌ఐ రాజేశ్ నాయక్ కథనం మేరకు.. సదాశివపేట మండలం మాలపాహడ్ గ్రామానికి చెందిన దాసరి దుర్గయ్య (56) మంగళవారం సింగూర్ ప్రాజెక్ట్‌లో చేపలు పట్టడానికి వెళ్లాడు. సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం సింగూర్ ప్రాజెక్ట్‌లో దుర్గయ్య మృతదేహం తేలడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని బయటకు తీయించారు.

చిన్నారిని చిదిమేసిన స్కూల్ బస్సు

- దిగి ఇంటికెళ్తుండగా ఢీకొట్టిన డ్రైవర్
- ఒకటో తరగతి విద్యార్థిని అశ్విని మృతి



చిన్నారి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీలు

పెద్దశంకరంపేట(మెదక్): స్కూల్ బస్సు ఢీకొని ఒకటో తరగతి విద్యార్థిని మృతి చెందిన ఘటన మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పెద్దశంకరంపేట మండలం మక్తలక్ష్మాపూర్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బోయిని చందు, సరితకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె బోయిని అశ్విని(8) పెద్ద శంకరంపేటలోని సాయిచైతన్య పాఠశాలలో 1వ తరగతి చదువుతోంది. రోజు మాదిరిగానే బుధవారం సాయంత్రం స్కూల్ పూర్తయిన తర్వాత ఇంటికొస్తుంది. గ్రామం వద్ద బస్సు దిగి వెళ్తుండగా డ్రైవర్ చూడకుండా చిన్నారిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అశ్విని అక్కడికక్కడే మృతి చెందింది. బస్సు డ్రైవర్ వెంటనే అక్కడి నుంచి పారిపోయాడు. చిన్నారి మృతికి డ్రైవర్, పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమంటూ గ్రామస్తులు బస్సును ధ్వంసం చేశారు. ఘటనా స్థలాన్ని అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, ఎస్‌ఐ శంకర్, ఏఎస్‌ఐ సునీత, పోలీసులు చేరుకొని వివరాలు సేకరించి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

బీఎస్సీ (హానర్స్) హార్టికల్చర్ కోర్సు సీట్లు పెంపు

ములుగు ఉద్యాన విశ్వవిద్యాలయ వీసీ రాజిరెడ్డి



ములుగు(గజ్వేల్): ములుగు శ్రీ కొండాలక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం 2024–25 విద్యాసంవత్సరానికి నాలుగేళ్ల బీఎస్సీ (హానర్స్) హార్టికల్చర్ కోర్సుతో సెల్ఫ్ ఫైనాన్స్ కోటాలో 34 సీట్లకు అదనంగా 20 సీట్లు పెంచినట్లు వైస్ చాన్స్‌లర్ దండ రాజిరెడ్డి తెలిపారు. దీంతో సీట్ల సంఖ్య 54కు పెరిగిందన్నారు. ఈ సీట్లకు ప్రవేశ వార్షిక రుసుం నాలుగేళ్లకు రూ.9 లక్షల నుంచి రూ.5 లక్షలకు తగ్గించినట్లు, హాస్టల్, మెస్ చార్జీలు అదనమని పేర్కొన్నారు. పెరిగిన 20 సీట్లను మోజెర్ల కాలేజీలో, 34 సీట్లను రాజేంద్రనగర్ కాలేజీలో భర్తీ చేస్తారని వివరించారు. కోర్సు వివరాల కోసం www.skltshu.ac.in వెబ్‌సైట్‌ను, ఉమ్మడి కౌన్సెలింగ్, అప్లికేషన్ కోసం www. pjtsau.edu.in వెబ్‌సైట్ సందర్శించాలని సూచించారు.

ఓటరు నమోదు కార్యక్రమాన్ని వినియోగించుకోండి



మాట్లాడుతున్న అధికారి దేవుజా

పటాన్‌చెరు టౌన్: నవంబర్ 9,10 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఓటర్ నమోదు అధికారి దేవుజా అన్నారు. బుధవారం పటాన్‌చెరు తహసీల్దార్ కార్యాలయంలో పలు పార్టీల రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్టోబర్ 29వ తేదీన డ్రాఫ్ట్ పబ్లికేషన్ ఉంటుందని, వాటిపైన ఏవైనా అభ్యంతరాలు ఉంటే ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమంలో తెలపాలన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ సంతోష్ కుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నర్సింహా రెడ్డి, బీజేపీ నాయకులు శ్రీనివాస్ గుప్తా, నరేశ్, బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీధర్, టీడీపీ నాయకుడు మహమ్మద్ నజీర్, బీఎస్పీ నుంచి ప్రశాంత్ కుమార్, సీపీఎం నుంచి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా రాణించాలి

- డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య
- స్వశక్తి సంఘాలకు రూ.20లక్షల వరకు రుణ సౌకర్యం



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య

హుస్నాబాద్‌రూరల్: స్వశక్తి మహిళలు వ్యాపారవేత్తలుగా రాణించాలని డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య అన్నారు. బుధవారం ఐకేపీ కార్యాలయ సమావేశ మందిరంలో కోహెడ, అక్కన్నపేట, హుస్నాబాద్ మండలాల స్వశక్తి సంఘాల ప్రగతిపై సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ మాట్లాడుతూ ప్రభుత్వం స్వశక్తి సంఘాలకు రూ.20లక్షల వరకు రుణ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే కొందరు మహిళా సంఘాల సభ్యులు రుణాలను తీసుకుని ఆర్థిక ప్రగతిని సాధిస్తున్నారన్నారు. పోటీ ప్రపంచంలో మహిళలు వ్యాపార వేత్తలుగా ఎదిగి పది మందికి ఉపాధి కల్పించాలని అన్నారు. పోతారం(ఎస్) మహిళల మాదిరే మిగతా గ్రామాల సంఘాలు కూడా ఉమ్మడి వ్యాపార యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఐకేపీ అధికారులు మహిళా సంఘాలు తీసుకోనే రుణాల ప్రగతి పై ప్రతి నెలా సమీక్ష నిర్వహించి సలహాలు అందించాలన్నారు. గ్రామాల్లో వ్యవసాయ అనుబంధంగా పాడి పరిశ్రమలో మహిళలు రానిస్తున్నారని వారికి డెయిరీ యూనిట్లు ఏర్పాటు చేసుకోవడానికి రుణాలను అందించాలని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు డీఆర్‌డీఓ మధుసూదన్, డీపీఎంలు విద్యాసాగర్, కరుణాకర్, ఏపీఎంలు శ్రీనివాస్, భిక్షపతి, తిరుపతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్య

మద్దూరు(హుస్నాబాద్): పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని లద్నూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పూల బూదమ్మమల్లేశం దంపతుల కుమారుడు పూల రాజు(22) డిగ్రీ పూర్తి చేసి, వ్యవసాయంలో తల్లిదండ్రులకు సహాయపడుతున్నాడు. బుధవారం ఉదయం చేర్యాలకు వెళ్లి పత్తిని మార్కెట్‌కు విక్రయించి మధ్యాహ్నం ఇంటికి చేరుకున్నాడు. అనంతరం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. బాధను తట్టుకోలేక స్నేహితుడికి ఫోన్ చేసి మందు తాగినట్లు చెప్పాడు. అతడు వెంటనే బావి వద్దకు వెళ్లి బైక్ పైనే గ్రామంలోని ఆస్పత్రికి తీసుకొచ్చాడు. మెరుగైన వైద్యం కోసం జనగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

జీవితంపై విరక్తితో..

హుస్నాబాద్‌రూరల్: జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన హుస్నాబాద్ మండలం కూచనపెల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన సింగిరెడ్డి రాజిరెడ్డి(52) ఎకరం భూమి కౌలుకు తీసుకొని పత్తి పంట సాగు చేస్తున్నాడు. మద్యానికి బానిసైన రాజిరెడ్డికి ఆరోగ్యం సహకరించకపోవడంతో పురుగుల మందు తాగి మంగళవారం ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గమనించి హుస్నాబాద్ ప్రభుత్వాస్పత్రికి అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దొంగతనం కేసులో నిందితుల రిమాండ్

వర్గల్(గజ్వేల్): దొంగతనం కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని అనంతగిరిపల్లికి చెందిన టీ. మల్లేశ్‌గౌడ్ ఇంట్లో ఈనెల 21న చోరీ జరిగిన విషయం తెలిసిందే. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు మండల పరిధిలోని నాచారంలో బుధవారం వాహనాల తనిఖీ చేపడుతుండగా ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని విచారించగా సుధాకర్, నారాయణ, షాబొద్దీన్‌లు అనంతగిరిపల్లిలో చోరీకి పాల్పడినట్లు రుజువైంది. నిందితుల నుంచి 5 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

తరుగు దోపిడీకి చెక్ పడేనా?

మిల్లర్లు, కొనుగోళ్ల నిర్వాహకులతో రైతులకు తప్పని భయం

- క్వింటాల్‌కు 5 నుంచి 6 కిలోల ధాన్యం కోత
- ప్రారంభమైన కొనుగోళ్లు
- అధికారులు దృష్టి సారించాలని రైతుల విన్నపం
- 2.11 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా



పీఏసీఎస్ ఆధ్వర్యంలో జోగిపేటలో ప్రారంభిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రం

వట్‌పల్లి(అందోల్): తరుగు పేరిట ధాన్యంలో కోత విధిస్తున్న మిల్లర్లు, కొనుగోళ్ల నిర్వాహకుల నుంచి ఈసారైనా విముక్తి కలుగుతుందో లేదో అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రతీఏటా అకాల వర్షాలు, చీడ పురుగుల బెడద పంట దిగుబడిపై ఒక వైపు ప్రభావం చూపుతుండగా మరోవైపు ధాన్యాన్ని అమ్ముకుందామని కొనుగోలు కేంద్రాలకు వెళితే నిలువు దోపిడీకీ చేస్తున్నారు. ప్రతీయేటా ఈ విషయంలో కొనుగోలు కేంద్రం నిర్వాహకులను రైతులు నిలదీస్తున్నప్పటికీ తేమ పేరుతో కొర్రీలు పెడుతూనే ఉన్నారు. ప్రభుత్వం సైతం ఈ విషయంపై దృష్టి సారించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

కొనుగోలు పత్రాలు ఇవ్వకుండానే..

అందోలు మండలంలోని కన్‌సాన్‌పల్లి, అందోలు, మాసాన్‌పల్లి, వట్‌పల్లి మండలంలోని ఖాదిరాబాద్ తదితర గ్రామాల్లో రైతులు మిల్లర్ల దోపిడీకి ఎక్కువ గురయ్యారు. కొందరు రైతులు తేమ, ఇతర కొర్రీలకు తట్టుకోలేక నేరుగా మిల్లర్లకే అమ్ముకున్న సంఘటనలు ఉన్నాయి. అనంతరం సదురు రైతులకు కొనుగోలు పత్రాలు కూడా ఇవ్వడం లేదు. మిల్లులో ధాన్యం దింపిన తర్వాత కోత పడిన ధాన్యాన్ని రైతుల ధాన్యంలో కోత పెడుతూ కొనుగోలు పత్రాలను అందజేశారు. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని రైతులు చెబుతున్నారు.

రెండేసి సార్లు తరుగు..

గత యాసంగి సీజన్ ధాన్యం తరలింపులో లారీల కొరత ఓ వైపు, అకాల వర్షాలు మరో వైపు ఉండటంతో ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగాయి. దీనికితోడు మార్కెటింగ్ శాఖ అధికారులు ధాన్యం ఆరబెట్టుకునేందుకు, వర్షాల నుంచి పాడుకునేందుకు టార్పాలిన్లను ఏర్పాటు చేయలేదు. దీంతో వర్షానికి ధాన్యం తడిసి మొలకెత్తింది. ఇదే అదునుగా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తేమ పేరుతో 40 కిలోల బ్యాగుపై అదనంగా 2.5 కిలోల వరకు తరుగు తీస్తూ తూకం చేశారు. తూకం చేసిన ధాన్యాన్ని మిల్లుకు తరలించగా మిల్లర్లు కూడా తేమను సాకు చూపుతూ క్వింటాల్‌కు 5 కిలోల తరుగూ ఇస్తేనే ధాన్యం దిగుమతి చేసుకుంటామని లేకుంటే వెనక్కి తీసుకువెళ్లాలని చెప్పడంతో రైతులు చేసేదేమి లేక ఒప్పుకున్నారు. ఇలా రెండేసి సార్లు తరుగు తీస్తూ రైతును నిలువునా దోపిడీ చేశారు.

183 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు..

వానాకాల సీజన్‌లో జిల్లాలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 43,766 హెక్టార్లు కాగా ఈ ఏడాది సన్నలు, దొడ్డు రకాలు కలిపి 55,448 హెక్టార్లలో పంట సాగైంది. దీంతో సుమారుగా 2.11 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానున్నట్లు అధికారులు భావిస్తున్నారు. జిల్లాలో ఐకేపీ ఆధ్వర్యంలో 84, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 83, డీసీఎంఎస్ ద్వారా 16 కలిపి మొత్తం 183 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయగా ఇప్పటికే 26కి పైగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, ఈనెల చివరి నాటికి పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభంకానున్నట్లు అధికారులు చెబుతున్నారు.

7 బస్తాల కోత విధించారు



గత యాసంగి సీజన్‌లో తూకం చేసే సమయంలో ఒక బ్యాగ్‌పై 2.5 కిలోల తరుగు తీసి 149 సంచుల ధాన్యాన్ని తూకం చేశారు. తూకం చేసిన తర్వాత కొనుగోలు పత్రం అడుగగా ధాన్యం మిల్లులో దించాక ఇస్తామని చెప్పి కొనుగోలు పత్రం ఇవ్వలేదు. ధాన్యం మిల్లులకు తరలించాక 7 బస్తాల ధాన్యం కోత పెట్టి 143 సంచులకు సంబంధించిన కొనుగోలు పత్రాన్ని అందజేశారు. దీంతో రూ.6,168 నష్టపోయాను. అధికారులు రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలి.

– పీ.నవీన్, రైతు, కన్‌సాన్‌పల్లి